# 02. మానస సంచరరే (అర్థ వివరణలు)




(గూగుల్,సౌజన్యం)

హృదయాన్ని భాషగా చేసుకొన్న భక్తకవులలో సదాశివ బ్రహ్మేంద్రులు ఒకరు. (1560-1762) పరబ్రహ్మాన్వేషణలో జీవితాన్ని సార్థకం చేసుకొన్నారు. ఎండ మావులు అబద్ధమని తెలిసినా, ఆ అబద్ధాన్ని నిజమని మోసగించుకొంటూ , మనస్సుకు దాసుల మయిన మనలాంటి సామాన్యుల కోసం -గమ్యాన్ని, సూచిస్తూ ఈ 'మానస సంచరరే' గీత ప్రవచనం చేసారు.

01. మానస సంచరరే బ్రహ్మణి

మానససంచరరే

02. మదశిఖిపింఛాలంకృతచికురే

03. మహనీయ కపోల విజిత ముకురే

మానససంచరరే బ్రహ్మణి

మానససంచరరే

04. శ్రీ రమణీ కుచ దుర్గ విహారే

05. సేవక జన మందిర మందారే

06. పరమహంస ముఖ చంద్ర చకోరే

07. పరిపూరిత మురళీ రవ ధారే

మానససంచరరే బ్రహ్మణి

మానససంచరరే

## పదార్థం

రే = ఒరేయ్ (తక్కువ వారిని పిలుచుటకు ఉపయోగించే శబ్దం);మానస = మనస్సా! బ్రహ్మణి =పరబ్రహ్మమునందు;సంచర = బాగా తిరుగుము; మద =సంతోషంతో నాట్యం చేసే;శిఖి = నెమలి ;పింఛాలంకృత =పింఛ+అలంకృత =పింఛంతో అలంకరింపబడిన;(ప్రకాశించునది పింఛము)చికురే =తల వెంట్రుకలు కలిగిన వానియందు (చిన్వన్ వర్ధమాన: కుర్యతే చిద్యత ఇతి చికుర: వృద్ధి పొందుతూ ఖండింపబడేది=తల వెంట్రుక);మానస = ఓ మనస్సా!సంచర = తిరుగుము; మహనీయ= శ్రేష్ఠ మైన, దివ్యమైన.;కపోల =చెక్కిలి;విజిత=జయింపబడిన;ముకురే= కలిగిన వాని యందు; శ్రీ = లక్ష్మి;రమణీ = క్రీడించునట్టి ఆడుది;సుందరమైన స్త్రీ.;కుచ = స్తనము;దుర్గ = కోట;విహారే = విహరించు వాని యందు; సేవక జన = కొలుచువాడు;మందిర= ఇల్లు;మందారే= ఒక కల్పవృక్షము; పరమహంస= ఉత్తమపదము నొందిన సన్న్యాసి;ముఖ చంద్ర = మోములనే చందమామలకు;చకోరే = చకోర పక్షి యైన వాని యందు; పరిపూరిత = చక్కగా నింపబడినది;మురళీ = పిల్లనగ్రోవి;రవ = ధ్వని;ధారే = ప్రవాహము కలిగిన వానియందు

## భావం

01.అక్కడక్కడా పనికి మాలిన విషయాలలో అదే పనిగా తిరిగే ఓ మనసా! కృష్ణ పర బ్రహ్మనికి సంబంధించిన విషయాలు వింటూ , చదువుకొంటూ అందులోనే ఆనందాలు అనుభవించు.

02.ఓ మనస్సా!సంతోషం తో నాట్యం చేసే నెమలి పింఛంతో అలంకరింపబడిన తల వెంట్రుకలు కలిగిన శ్రీ కృష్ణుని ధ్యానించు.

03.ఓ మనసా! స్వామి చెక్కిలి దివ్యమైనది. అది ఎటువంటిదనుకొన్నావ్ ! అద్దాన్ని జయించింది. అంటే అద్దం కంటే ప్రకాశంగా ప్రతిబింబాలని తనలో చూపించేది.అద్దాన్ని జయించిన కాంతిగల స్వామి చెక్కిలిని తలచి సంతోషించవే !

04.అందమైన లక్ష్మి దేవి స్తనములనే కోటలందు విహరించు కృష్ణునియందు మనస్సును నిలుపు.

05.తనని కొలిచేవారికి మందార కల్పవృక్షములా కోరిన కోరికలు తీర్చే కృష్ణునియందు మనస్సును నిలుపు!

06.చకోరాలు చంద్రుని వంక ఎంత ప్రేమతో చూస్తాయో ,అంత ప్రేమతో పరమహంసలముఖ చంద్రులను చూసే కృష్ణుని ధ్యానించు.

07.కష్ట గ్రీష్మానికి ఎండిపోయిన హృదయాల యందు పిల్లనగ్రోవి అనే తీయని ప్రవాహాన్ని నింపే కృష్ణునియందు మనస్సును నిలుపు.

**అంతరార్థం**

**మానస సంచరరే బ్రహ్మణి మానససంచరరే**

మనస్సును పనికి మాలినదిగా సంబోధిస్తూ 'రే' అన్నారు సదాశివ బ్రహ్మేంద్రులు.లొంగి ఉన్నవాడిని 'రే' అని సంబోధిస్తాం.మనస్సును లోబరుచుకోవాలని ఇందులో అంతరార్థం. లోబడినదే మనం చెప్పినట్టు వింటుంది. పరమాత్మ వైపు మనస్సు పెడితే అదే లొంగి వస్తుందని సందేశం.

సంకల్ప వికల్పాత్మకమైనది మనస్సు. వ్యాసుడు ''సర్వేమనోనిగ్రహ లక్షణాంతా:'' అన్నాడు. అన్ని అవస్థలలో , 'మనస్సు'ను నిగ్రహించుకోవాలి. . 'మనో నిగ్రహం గొప్ప శక్తిని కలిగిస్తుంది. మనో నిగ్రహం -అనేది స్వామి వైపు దానిని మరల్చినప్పుడే సాధ్యం. అందువల్లే మనస్సును ఆత్మయందు (పరమాత్మ ) స్థాపితం చేసి ఆత్మకు ఎప్పుడూ ఆధీనపరచాలని భగవద్గీత చెప్పిన విషయం ప్రసిద్ధం .

‘‘కామం, క్రోధం మొదలైనవి చాలా శక్తి కల మనో వికారాలు. వీటిని లౌకిక విషయాల పై ఉంచినంత కాలం అవి మనకు శత్రువులే. . వాటిని దేవుని వైపు మళ్ళిస్తే అవే దేవునితో మనలిని కలిపే స్నేహితులవుతాయి.’’ సదాశివ బ్రహ్మేంద్రులు ఈ పల్లవిలో అదే చెబుతున్నారు.

**మదశిఖి పింఛాలంకృత చికురే**

పాములను హింసిస్తుంది కాబట్టి దానిని మయూరమన్నారు.. (మీనాతి సర్పాన్ మయూర:)

నృత్యంతో అలరించేది మగ నెమలి. ఆడు నెమలి (మయూరి ) కాదు. “ఆడవే మయూరమా!” అనాలి. “ఆడవే మయూరీ!” అనకూడదు. అయితే ప్రతిభావంతుడైన కవి ప్రయోగం కనుక ఆయన అలా ప్రయోగించినప్పటికీ ప్రజలు ఆమోదించారు. ఈ విషయం ఆ కవి ఒక పత్రిక ముఖా ముఖిలో స్వయంగా ఒప్పుకొన్నారు.(ఆంధ్ర ప్రభ జులై 2010 సంచిక)

మగ నెమలి పింఛం విప్పినప్పుడు ఇలా ఉంటుంది.



**ఆడు నెమలి పించం విప్పినప్పుడు ఇలా ఉంటుంది.**



(గూగుల్,వికీపీడియాలసౌజన్యంతో పై రెండు చాయా చిత్రాలు గ్రహింపబడినవి.)

కృష్ణుడు నెమలి పింఛాన్ని ధరించటానికి కారణాలు ఇలా చెబుతారు.

1. ఈ విశ్వం లో ప్రధానమైన రంగులు నీలం (పగలు). నలుపు (రాత్రి) . ఈ విశ్వంలోని ప్రధానమైన ఆ రెండు రంగులనూ కలబోసుకొన్న నెమలి పించాన్ని ధరించటం ద్వారా , తాను విశ్వ ధారకుడినని స్వామి తెలియ చేస్తున్నాడట. అందుకు సంకేతం ఈ నెమలి పింఛ ధారణట.

2. ఈ సృష్టిలో సంభోగం చేయని జీవి నెమలి. అందుకే పవిత్రుడైన (నిత్య బ్రహ్మ చారి) స్వామి , పవిత్రమైన నెమలీకను ధరిస్తాడని చాగంటి కోటేశ్వరరావు గారు ఒక ఉపన్యాసంలో పేర్కొన్నారు.

కారణాన్వేషణలు దాటిపోయిన సమాధి స్థితిలో ఒక యోగి పుంగవుడి నోటినుండి వెలువడిన బీజాక్షరాలు శిఖి పించాలంకృత చికురే.. అనేవి.ఆ పద ప్రయోగ కారణాలు వెతకటం సాహసమే. అయినా కలి పురుషుడి ప్రభావంతో ఇలా సామాన్యుడి అక్షరాలు ఎగిరెగిరి పడుతుంటాయి.

## మహనీయ కపోల విజిత ముకురే

సదాశివ బ్రహ్మేంద్రులు ఈ పాదంలో చేసిన అద్దం ప్రస్తావన 'విశ్వం దర్పణ దృశ్యమాన నగరీ తుల్యం ' అను శ్లోకమును గుర్తుకు తెస్తోంది.ప్రపంచమంతా అద్దంలో కనిపించే పట్టణంలా ఉంటుంది కాని సత్యం కాదు. అద్దంలో కనిపించిన ఏవస్తువైనా విడిగా తీసి చూపించలేము.కాని కనిపిస్తూ ఉంటుంది. స్వామి యందు కనబడే ఈ సకల చరాచర సృష్టి ఇంతే.స్వామి కంటే వేరైనది కాదు. ఈ భావాలని గుర్తుకు తెచ్చే విధంగా సదాశివ బ్రహ్మేంద్రులు ముకుర ప్రస్తావన చేసారు.

వేదాంతాన్ని ఉత్సవాల్లో కలిపి నిగూఢంగా బోధించటం ఈ జాతి ప్రత్యేకత. ఇదివరకు ముకుర పరీక్ష అని ఒక ఆచారముండేది. అలంకరించిన వారిని అద్దాలముందు కూర్చోబెట్టిసరదాగా పరీక్షలు పెడుతుండేవారు."...ఎంత సూక్ష్మగ్రాహి, యిది యించు ముకురపరీక్ష నెఱపు." [కళా.7-102]అని కళా పూర్ణోదయం లో ఈ ముకుర పరీక్ష ప్రస్తావన ఉంది.మొత్తానికి చెప్పొచ్చేదేమిటంటే అద్దం వేదాంత ప్రతీక అని...సదాశివ బ్రహ్మేంద్రులు ఈ పాదంలో దానిని అమోఘంగా ఆవిష్కరించారని పిండితార్థం.

## శ్రీ రమణీ కుచ దుర్గ విహారే

"కమలా కుచ చూచుక "అనే వర్ణన ఉన్న శ్రీ స్వామివారి స్తోత్రంలోనే 'మాతుస్తనావివ శిశో రమృతాయమానౌ '(స్వామి పాదాలు తల్లి స్తనముల వలె శిశువుకుఅమృతపు

రుచినిస్తాయి ") అనే పాదం కూడా ఉంది.. భక్తుడు శిశువు. దేవి తల్లి. భక్త కవుల కుచ వర్ణనలలో అంతరార్థం ఇదే. బ్రహ్మేంద్రుల కుచ దుర్గ వర్ణనలో కూడాఇటువంటి అమృత మాతృ భావన నిక్షిప్తమై ఉంది.

సేవక జన మందిర మందారే

దేని చేత సంతోషిస్తారో అది మందారం . మందారము, పారిజాతము, సంతానము, కల్ప వృక్షము, చందనము ఈ అయిదు వరుసగా దేవ వృక్షాలు. ఇందులో మందారాన్ని స్వామితో బ్రహ్మేంద్రులు పోల్చారు. చేసుకొన్నవారికి చేసుకొన్నంత .కొలిచినవారికి కొలిచినంత. ఆయన అనుగ్రహ రాశి అలా కొండంతగా ,కొండంత అండగా ఉంది.భక్తుడు కొలవటమే ఆలస్యం. సంతోషాలు ఇంట్లో, హృదయంలో నాట్యం చేస్తాయి.

పరమహంస ముఖ చంద్ర చకోరే

సాధారణంగా చకోరాలతో భక్తులను , చంద్రునితో భగవంతుని ఉపమించటం కవులలో కద్దు.ఇక్కడ వ్యత్యస్త పాదారవిందునికి , వ్యత్యస్తంగా (=వ్యత్యాసపడినది, placed crosswise.)పోలికను చెప్పి, ఆయన యొక్క భక్త పరాధీనతను బ్రహ్మేంద్రులు పేర్కొన్నారు. పరమహంస అనేది బ్రహ్మేంద్రుల ముద్ర. వారు వ్రాసిన కీర్తనల్లో ఈ పదం కనిపిస్తుంటుంది.

పరిపూరిత మురళీ రవ ధారే

కృష్ణుడంటేనే ఆకర్షించేవాడు అని వేణువంటే అల్లుకొనేది అని అర్థాలు (వయంత్యనేన వేణు:) ఆకర్షించే వేణుగానం భక్తుల హృదయాలను స్వామి పాదాలను అల్లుకొనేటట్లు చేస్తుంది. మురళీరవం అలౌకిక ఆనందానుభూతిని ప్రసాదించే ఒక అమృత ప్రవాహం.

తీపిని అదే పనిగా అస్వాదిస్తుంటే ఒక స్థాయికి వచ్చేసరికి వెగటు కలుగుతుంది. స్వామి వేణుగాన మధురిమను ఎంత సేవిస్తుంటే అంత ఆనందం పెరుగుతుంటుంది. ఆ అమృతానుభూతిలో బ్రహ్మేంద్రుల నోటివెంట 'పరిపూరిత మురళీ రవధారే' పాదం పరబ్రహ్మమైన కృష్ణ స్వామి పాదాల వైపు కదిలింది.

తాను చూచిన దివ్యానుభూతిని మాటలలో పొదగటం అందరివల్ల అయ్యే పనికాదు. అది సదా శివ బ్రహ్మేంద్రుల వంటి భక్త కవులకే సాధ్యం. ఈ 'మానస సంచరరే' గీతం చదవటం ,వినటం ఒక దశ. ఆ గీతంలో కదలాడుతున్న స్వామి పాదాల అందెల చప్పుడును వినగలగటం ఇంకో దశ. స్వస్తి. ***



(తమిళనాడులోని తిరుచిరిపల్లికి 100 కి.మీ. పశ్చిమంగా ఉన్న ప్రాంతం నెరూర్ లో సదాశివ బ్రహ్మేంద్రుల సమాధి (మూల చిత్ర గ్రాహకుల సౌజన్యంతో)

-